క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయా స్టేషన్ల అధికారులు వారి పరిధిలోని రౌడీ షీటర్లను, నేర చరిత్ర కలిగిన వారిని, చెడు నడత కలిగిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర వృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని హిత బోధ చేశారు. గొడవలు, ఘర్షణలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) ఆవరణలో ఈ నెల 14వ తేదీన ఉదయం 11 గంటలకు నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ సి. సుంకన్న తెలిపారు. ఆదివారం రాత్రి వారు విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో మాట్లాడుతూ రూ.4 లక్షల వ్యయంతో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు ఆవిష్కరిస్తారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు, ఎన్జీఓ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీఎం వెంకటేశ్వర్లు, ఎన్సీహెచ్ బజారన్న, కోశాధికారి ఆర్ సంజీవకుమార్, నాయకంటి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న సీఐ మన్సూరుద్దీన్, సిబ్బంది

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు డ్రోన్ కెమెరా సేవలు వినియోగిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆదివారం సాయంత్రం డ్రోన్‌లతో నిఘా పటిష్టం చేశారు. ప్రధాన సర్కిళ్లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌ను వినియోగించి నిఘా ఏర్పాటు చేశారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను గుర్తించారు. అలాగే నిబంధనలను పాటించని వారికి ఆన్‌లైన్‌లోనే జరిమానాలను విధించారు. ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీలు, కూడళ్లలో వాహనాల రాకపోకలపై డ్రోన్ నిఘాతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కాకుండా కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి అక్కడికి ట్రాఫిక్ సిబ్బందిని పంపి ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలో ఇకపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు, ఇరుకు రోడ్లలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘాను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గడ్డివాముల దగ్ధం



రామదుర్గం గ్రామంలో కాలిపోతున్న గడ్డి వాములు

చిప్పగిరి: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని 10 గడ్డి వాములు కాలి సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండలంలోని రామదుర్గం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామం వెలుపల ఉన్న జగనన్న కాలనీ సమీపంలో 10 మంది రైతులు పశువుల మేత కోసం జొన్న చొప్ప, వరిగడ్డితో వాములు వేసుకున్నారు.రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఒకదాని నుంచి మరోవాముకు మంటలు వ్యాపించాయి.అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా వాహనం వచ్చే లోపు గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. నష్టపోయిన రైతుల్లో సోమన్న,ఏకాంత్,రామంజి ఉన్నారు.

గుర్తిస్తే క్యాన్సర్‌కు మెరుగైన చికిత్స



కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): ముందుగానే గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి మెరుగైన చికిత్స అందించి కాపాడవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. కర్నూలులోని ఐఎంఏ భవన్‌లో క్యాన్సర్‌పై నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌సీడీ 3.వో సర్వేలో భాగంగా వైద్య సిబ్బందిని ఇంటింటికి పంపించి స్క్రీనింగ్ చేస్తున్నారన్నారు. ఇందులో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు రెఫర్ చేస్తారన్నారు. అక్కడ వారు వ్యాధినిర్ధారణ చేసి మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపిస్తారన్నారు. అక్కడ వారికి అవసరమైన చికిత్స అందించి నయం చేస్తారన్నారు. ఈ వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నయం అవుతుందని, చివరి స్టేజిలో గుర్తిస్తే పూర్తిగా నయమయ్యే అవకాశాలు కష్టం అవుతాయన్నారు. అందుకే ప్రభుత్వం ముందుగా గుర్తించి చికిత్స అందించేందుకు సర్వే చేపట్టిందన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో భాగంగా నూతన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. ఐఎంఏ అధ్యక్ష, కోశాధికారులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ మాధవీశ్యామల మాట్లాడుతూ.. ఐఎంఏ ఆధ్వర్యంలో ఒమెగా హాస్పిటల్ సౌజన్యంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల్లో చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం క్యాన్సర్‌లో వివిధ అంశాలపై నిపుణులైన వైద్యులు ప్రసంగించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒమెగా హాస్పిటల్ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒమెగా హాస్పిటల్ క్యాన్సర్ వైద్యులు వై.వెంకటరామిరెడ్డి, బి.రవీంద్రబాబు, బి.రవిశంకర్, ఎం.జి. నాగకిశోర్, యు.ఉమామహేశ్వరరెడ్డి, కె.సుధీర్‌రెడ్డి, వై. ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న కోల్స్‌చర్చి సభ్యులు, చిన్నారులు, మహిళలు

కర్నూలు (టౌన్): యేసుక్రీస్తు జెరుషలేమ్‌లో ప్రవేశించడాన్ని పురస్కరించుకొని నగరంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి నిర్వాహకులు, మహిళలు, చిన్నారులు మట్టలను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. సీసీ చర్చి సండే స్కూల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో హోసన్న, హోసన్న అంటూ నినదాలు చేశారు. కార్యక్రమంలో చర్చి సూపరింటెండెంట్ దేవ మనోహర్, పాస్టర్ జి. రవికుమార్, మనోహర్, శ్వేతా, సంపత్, మధుకర్ పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లోని సిఫా చర్చిలో...



సిఫా చర్చిలో మట్టలను ప్రదర్శిస్తూ ప్రత్యేక కీర్తనలు ఆలపిస్తున్న సభ్యులు

గణేస్ నగర్‌లోని సిఫా చర్చిలో ఆదివారం మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టలను ప్రదర్శిస్తూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఫిలిప్, చర్చి సంఘ సభ్యులు తిరుపాల్, రాజు, విజయ్, దస్తగిరి, డాక్టర్ అంజనేయులు, డేవిడ్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో అనధికార నివాసితుల గుర్తింపు

- ఈనెల 15 నుంచి కుళాయి కనెక్షన్ల తొలగింపు, విద్యుత్‌సరఫరా నిలిపివేతకు చర్యలు

కర్నూలు (టౌన్): రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం ప్రభుత్వం గతంలో నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. ఏ- టైపు, బీ-టైపు, సీ-టైపు, డి- టైపు పేర్లతో 1009 ఇళ్లు కలిగిన ఈ క్వార్టర్స్‌కు పదేళ్ల క్రితమే సర్కారు మెయింటెనెన్స్ నిధులు నిలిపివేసింది. నాటి నుంచి అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో అనధికారికంగా కొందరు ఆ గృహాల్లో ఉంటున్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండా కరెంటు, తాగునీరు సౌకర్యాన్ని వాడుకుంటున్నారు. గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని అనేక సార్లు కలెక్టర్, రెవెన్యూ అధికారుల స్థాయిలో చర్చలు జరిగినా ఫైలు ముందుకు కదలలేదు.ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బీ- టైపు క్వార్టర్లలో బీ/సీ-45 నుంచి వరుసగా బీ/సీ-83 వరకు ఉన్న ఇళ్లలో 39 మంది అనధికారికంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఇళ్ల నుంచి ప్రభుత్వానికి హెచ్ ఆర్ఏ, తాగునీటి కుళాయి పన్నులు రావడం లేదు. దీంతో మొదటి విడతగా ఈనెల 15 వ తేదీ నుంచి ఆయా ఇళ్లలో నివసించే వారికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. అలాగే తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లను తొలగించనున్నారు. ఈ కార్యక్రమం తరువాత రెండో విడత కింద మరి కొన్ని ఇళ్లను గుర్తించి పై చర్యలు చేపడుతామని జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడించింది.

బి. క్యాంపులో క్రికెట్ స్టేడియం నిర్మాణం?

పాడుబడిన అనేక ఆర్అండ్ బీ క్వార్టర్లను కూల్చివేసేందుకు అధికారులు నిర్ణయించారు. త్వరలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు ముందుగా విద్యుత్, తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నారు.ఆ తరువాత శిథిలావస్థకు చేరిన బిల్డింగ్‌లను కూల్చివేసి మొత్తం 5 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టనుంది.


రిజర్వేషన్ల పితామహులు బీపీ మండల్



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): దేశంలో వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. ఆదివారం బీపీ మండల్ 43వ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి ఎం రాంబాబు, కులాల ఐక్య వేదిక అధ్యక్షులు టీ శేషఫణి, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో సామాజికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు 1979లో మొరార్జీదేశాయ్ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను నియమించిందన్నారు. ఈ కమిషన్‌కు పార్లమెంట్ సభ్యులైన బీపీ మండల్ నాయకత్వం వహించి దేశ జనాభాలో 52 శాతం మంది ఓబీసీలు ఉన్నారని హేతుబద్ధ ఆధారాలతో నివేదికలను అందించారన్నారు. ఆ నివేదికల ఆధారంగానే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ల సంఖ్య 49.5 శాతానికి చేరుకుందన్నారు. ఈ నివేదికల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో రిజర్వేషన్లను అమలు చేయడంలో అశ్రద్ధ చూపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీపీ మండల్ కమిషన్ నివేదికలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నయాదవ్, శ్రీరాములుయాదవ్, వడ్డెర బాలాజీ, లక్ష్మి నారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెస్ నిధులను గ్రంథాలయాభివృద్ధికి వినియోగించాలి



సదస్సులో మాట్లాడుతున్న వల్లూరు శివప్రసాదు

కర్నూలు(సెంట్రల్): సెస్ రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న నిధులను గ్రంథాలయాలభివృద్ధికి వినియోగించాలని ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో అరసం జిల్లా అధ్యక్షుడు కలంప్రహ్లాద అధ్యక్షతన గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజల్లో కాంక్షను రగిలించడానికి, సామాజిక స్పృహను పెంచడానికి, మానవీయ విలువలను పెంపొందించడానికి అశాస్త్రీయ భావాలను తొలగించడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నేడు గ్రంథాలయాలు ఆదరణకు నోచుకోక నిర్వీర్య స్థితిలో ఉన్నాయన్నారు. గ్రామ,గ్రామాన గ్రంథాలయాలను పునరుద్ధరించాలని, ఖాళీగాఉన్న గ్రంథాలయ ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 27వ తేదీనవిజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, అధికసంఖ్యలో సాహితీ అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న చంద్రశేకర్ కల్కూరా, జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ..గ్రంథాలయాల పునరుద్ధరణకు అన్ని భాషాసాహితీ సమాజిక సంస్థలు ఒకే తాటి పై నిలబడి పోరాడాలన్నారు. ఊరూరా విజ్ఞానాన్ని పంచుతూ కళకళలాడిన గ్రంథాలయాలు నేడు కనుమరుగు దశలో ఉండటం చాలా విచాకరమన్నారు. కాగా, ఇటీవల ఉగాదిపురస్కారాలు అందుకున్న డాక్టర్ ఎం.హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్, దాసరి వెంకటరమణలను అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ తరపున ఘనంగా సన్మానించి పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎం.హరకిషన్, మారుతి పౌరోహితం, ఎస్‌డీవీ అజీజ్, డీఎస్పీ మహబూబ్ బాషా, ఇనయతుల్లా, కొత్తపలి సత్యనారాయణ, ప్రమోద్‌చక్రవర్తి, ఆదవాని హనుమంతప్ప, బలశౌరి, చక్రపాణి యాదవ్, రాణీలీలావతి, చంద్రమౌళి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హమాలీ ఆత్మహత్య

కర్నూలు: కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖ గోదాములో హమాలీగా పనిచేసే రవికుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శనివారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. భోజనం అనంతరం గదిలోకి వెళ్లి తలుపు వేసుకొని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపు తర్వాత కుటుంబ సభ్యులు తలుపులు తట్టగా పలకకపోవడంతో బలవంతంగా వాటిని తొలగించి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవికుమార్ సంజయ్‌గాంధీ నగర్‌లో నివాసం ఉంటాడు. భార్య సునీతతో పాటు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి దుర్మరణం



షేక్ మహమ్మద్ బాషా (ఫైల్)

కర్నూలు: నగర శివారులోని సుంకేసుల రోడ్డులో శ్మశానవాటికి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి షేక్ మహమ్మద్ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన పాతబస్తీలోని పింజరివీధిలో నివాసం ఉంటున్నారు. బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో మామిదాలపాడు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా సుంకేసుల రోడ్డు స్మశానవాటిక వద్ద కుక్కను తప్పించబోయి డివైడర్‌కు వాహనంతో ఢీ కొట్టాడు. కింద పడి తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈయనకు భార్య వహీదాకాతూన్, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుంగభద్రలో గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు: ఖండేరి సమీపంలో తుంగభద్ర నదిలో గుర్తు తెలియని పురుష మృత దేహం బయటపడింది. నీటిపై తేలియాడుతుండగా, స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండి, ఆకుపచ్చ కలర్ షర్ట్, బ్రౌన్ కలర్ లోయర్ ధరించాడు. నీటిలో మునగడం వల్ల మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా తయారైంది. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడా, లేక ఎవరైనా హత్య చేసి నదిలో పడవేశారా ? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈయన ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే కర్నూలు ఒకటో పట్టణ పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రేపు తెలుగు నాటక రంగ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): కవి, సంఘ సంస్కర్త, మొదటి తెలుగు నాటక రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని మంగళవారం టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాటక రంగానికి చెందిన హార్మోనిస్టులు పీజీ వెంకటేశ్వర్లు, జేయం రాజశేఖరరాజు, లక్ష్మన్న, కేశవులు, ఎస్.ధనుంజయ్య, పి.రామలింగం, ఎస్.రామకృష్ణారెడ్డి, జయ మహేశ్వరయ్య, బందేగౌడ, బలరాంనాయుడు, చల్ల నరసింహనాయుడు, కేబీ నాగప్పకు కందుకూరి పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం నవీన్‌కుమార్ నాయుడు బృందం హరిశ్చంద్ర నాటకం, కేవీ రమణ బృందం శ్రీకృష్ణ రాయభారంలోని సన్నివేశాలను ప్రదర్శిస్తారని చెప్పారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు.

వక్ఫ్ సవరణ చట్టం అమలును నిలిపి వేయాలి



సమావేశమైన ముస్లిం సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం అమలును వెంటనే నిలిపి వేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్తీలో ముస్లిం సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ముస్లిం పర్సనల్ లాబోర్డు జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా మాట్లాడుతూ..వక్ఫ్ సవరణ చట్టంతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముస్లిం సమాజాన్ని మేల్కొల్పేందుకు మసీదుల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.అన్ని కులాలు, మతాలు, సంఘాలను కలుపుకొని ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. 30వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంట్లో కరెంట్ ఆఫ్ వేసి అర గంట పాటు నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఫోమా నాయకులు ఎంఏ హమీద్ అజీన్ ఖాన్,సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్,జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు మునీర్ అహ్మద్, అబ్దుల్‌రహమాన్, అవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

పూలే చిత్రాన్ని అడ్డుకోవడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): మహాత్మా జ్యోతిరావు పూలే వాస్తవ చరిత్ర ఆధారంగా నిర్మించిన పూలే చిత్రాన్ని రిలీజ్ కాకుండా అడ్డుకోవడం దారుణమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని చీల్చిచెండాడిన పూలే చిత్రాన్ని అడ్డుకునే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాశ్మీరి ఫైల్స్, కేరళ ఫైల్స్, చావా, రజాకార్ వంటి మత విద్వేషాలను రెచ్చగొట్టే కల్పిత సినిమాలకు పన్నులు మాఫీ చేస్తూ రాయితీలు కల్పించి రిలీజ్ చేశారని, వాస్తవ చరిత్రతో తీసిన పూలే సినిమాను రిలీజ్ చేయకుండా అడ్డుకోవడం బహుజనులను అవమానించడమే అన్నారు. ఓ వైపు సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వని అశ్లీల చిత్రాలను విడుదల చేస్తున్న ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డులు ఎందుకు పూలే చిత్రాన్ని అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పలన్నారు. లేని పక్షంలో బహుజనులు ఏకమై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

కంచి వర్సిటీలో ఉత్తమ విద్యాబోధన



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కర్నూలు(సెంట్రల్): తమిళనాడులోని కంచి విశ్వవిద్యాలయంలో సకల సదుపాయాలు కల్పించి ఉత్తమ విద్యాబోధన చేస్తున్నట్లు ఆ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ గుల్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కంచి వర్సిటీకి సంబంధించి స్పాట్ అడ్మిషన్లను శంకరమఠంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వర్సిటీలో ఉన్న సదుపాయాలు, సౌకర్యాలను వివరించారు. 28 సంవత్సరాలుగా ఇంజినీరింగ్‌లోని అన్ని విభాగాలు, శాస్త్ర, సాంకేతిక, మేనేజ్‌మెంట్, వైద్య విజ్ఞాన శాస్త్రం, పార మెడికల్ విభాగం, ఫిజియోథెరపీ, విద్యా శాస్త్రం, న్యాయ శాఖ, ఇతర సాంఘిక సంస్కృత భాషా శాస్త్రముల్లో యూజీ, పీజీ , పరిశోధన విభాగాల్లో బోధన జరుగుతున్నట్లు చెప్పారు. బాలబాలికలకు విశ్వ విద్యాలయ ఆవరణలోని సువిశాల వసతి గృహాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదవాకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు తీసుకోవాలని డీన్ వెంకటరమణ కోరారు. వివరాలకు 9655085217 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర నాయకులు హెచ్‌కే రాజశేఖరరావు, కల్లె చంద్రశేఖర్ శర్మ,కల్లే వేణుగోపాల్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోవాలా



పోలీసుల సమక్షంలో బాధితుడికి బ్యాగ్ అప్పగిస్తున్న ఆటోవాలా

కర్నూలు: తన ఆటోలో ప్రయాణికుడు మరచిపోయిన బ్యాగ్‌తో పాటు బంగారు నగలను తిరిగి బాధితుడికి అప్పగించి ఆటోవాలా తన నిజాయితీని చాటుకున్నాడు. నంద్యాల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ బ్యాంకు ఉద్యోగి. కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ఓ పెళ్లికి హాజరయ్యాడు. కుటుంబంతో కలిసి చెక్‌పోస్టు వద్ద ఆటో ఎక్కి సుంకేసుల రోడ్డులో ఉన్న కార్తీక్ హాస్పిటల్ వద్ద తన బ్యాగ్‌ను ఆటోలోనే మరచిపోయి దిగిపోయారు. అందులో సుమారు రూ.75 వేల విలువ చేసే జత కమ్మలు కూడా ఉన్నాయి. శ్రీధర్ హాస్పిటల్‌కు వెళ్లిన తరువాత బ్యాగ్‌ను ఆటోలోనే మరచిపోయినట్లు గుర్తు చేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐలు సుబ్బరాజు, అస్లాం, కానిస్టేబుళ్లు లక్ష్మన్, జిలానీ తదితరులు సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించారు. డ్రైవర్‌ను పిలిపించగా, వారికి బ్యాగును అప్పగించారు. దీంతో ఆదివారం బాధితుడిని పిలిపించి ఆటో వాలా చేతనే బ్యాగు ఇప్పించారు. దీంతో బాధితుడు పోలీసులకు, ఆటోవాలాకు కృతజ్ఞతలు చెప్పారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆదివారం కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్)కర్నూలు శాఖ ఆధ్వర్యంలో బిల్డర్లు, క్రెడాయ్ సభ్యులతో కలిసి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. అలాగే పారిశ్రామిక కారిడార్‌లో డ్రోన్స్, సెమీ కండక్టర్ల పరిశ్రమలు వస్తున్నాయన్నారు. అంతకు ముందు క్రెడాయ్ కర్నూలు చాప్టర్ చైర్మన్ గోరంట్ల రమణ మాట్లాడుతూ కర్నూలు చుట్టుపక్కల ఆర్థిక మండళ్లు, కర్నూలుకు రైల్వే డబుల్ లైన్, కర్నూలు నుంచి విజయవాడ, విశాఖపట్నం రైల్వే మార్గాన్ని ఓర్వకల్లుకు అనుసంధానం చేయాలన్నారు. నగరంలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేసి, వాహనాల రద్దీ నియంత్రణకు హంద్రీ నది, ప్రధాన కూడళ్లలో ఉపరితల వంతెనలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అడ్వైజరీ కమిటీ చైర్మన్ సాయిరాం రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రకాష్, ఆర్ఎస్ రెడ్డి, కేఈ పినాకపాణి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో సర్కారు చెలగాటం

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు చెల్లించకుండా వారి జీవితాలతో కూటమి సర్కారు చెలగాటమాడుతోందని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల ఫీజులను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సంబంధించి 3,900 కోట్ల ఫీజులను బకాయిపెట్టిందన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

కర్నూలు (టౌన్) : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం ఈ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని, నగర ప్రజలు గమనించాలని వెల్లడించారు.

లేబర్ కోడ్ల రద్దుకు పోరాటం



మాట్లాడుతున్న సీహెచ్ నరసింహరావు

కర్నూలు(సెంట్రల్): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేద్దామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహరావు హెచ్చరించారు. ఆదివారం కర్నూలులో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర స్థాయి ప్రాంతీయ సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడుతూ..బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన కార్మిక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. 29 రకాల కార్మిక చట్టాలను మార్పు చేస్తూ నాలుగులేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటితో కార్మికులు 8 గంటల పనిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. అంతేకాక కార్మికులు సమ్మె చేసే హక్కును కాలరాసిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు, కర్నూలు, అనంతపురం, కడప,నంద్యాల, సత్యసాయి జిల్లాల కార్య దర్శులు ఎండీ అంజి బాబు, నాగేంద్ర, మనోహర్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.